# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-05-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. రాజకీయాల కోసం తెలంగాణ అభివృద్ధిని కాంగ్రెస్ అడ్డుకుంటోందని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు.**

**2. అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 2 వేల 387 మంది అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు.**

**3. గుంటూరు జిల్లా ఉండవల్లిలో కూటమి నాయకులు నారా చంద్ర బాబు నాయుడు, కె. పవన్ కళ్యాణ్, బి. జె. పి రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ సిద్ధార్థ నాథ్ సింగ్ కూటమి మ్యానిఫెస్టోను నిన్న విడుదల చేశారు.**

**4. తెలంగాణలో విడుదలైన పదో తరగతి పరీక్షల ఫలితాల్లో 91.31 శాతం ఉత్తీర్ణత నమోదైంది.**

5. **ఈ రోజు ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.**

==========================

తెలంగాణలోని మెదక్ జిల్లా జహీరాబాద్ లో నిన్న జరిగిన ఎన్నికల ప్రచార సభలో బీజేపీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ.. రాజకీయాల కోసం తెలంగాణ అభివృద్ధిని కాంగ్రెస్ అడ్డుకుంటోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కుటుంబ పాలనపై ఆధారపడి ఉందని అన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రప్రభుత్వం లక్ష కోట్లరూపాయలను కేటాయించామని అన్నారు. నాలుగు వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయని జహీరాబాద్ సహా 40 రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ పథకం కింద అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

--------------------------

అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఈ నెల 13న జరిగే ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో 25పార్లమెంటు స్థానాలకు 454 మంది అభ్యర్థులు, 175 శాసనసభ స్థానాలకు 2,387 అభ్యర్థులు పోటీచేస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఓ ప్రకటనలో తెలిపారు. పార్లమెంటుకు సంబందించి 49 మంది అభ్యర్థులు, అసెంబ్లీ స్థానాలకు సంబందించి 318 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉ పసంహరించుకున్నారు. ఏప్రిల్ 18 నుంచి 25వ తేదీ వరకు జరిగిన నామినేషన్ల స్వీకరణలో 25 పార్లమెంటు స్థానాలకు సంబంధించి మొత్తం 503 మంది అభ్యర్థులు, 175 శాసనసభ స్థానాలకు సంబంధించి 2 వేల 705 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. పార్లమెంటుకు అత్యధిక మొత్తంలో విశాఖ పార్లమెంటు

స్థానానికి 33 మంది అభ్యర్థులు పోటీపడుతుండగా, అత్యల్పంగా 12 మంది అభ్యర్థులు రాజమహేంద్రవరం పార్లమెంటు స్థానానికి పోటీపడుతున్నారు. అదే విధంగా శాసనసభ స్థానాలకు సంబందించి అత్యధికంగా తిరుపతి శాసనసభ స్థానానికి 46 మంది అభ్యర్థులు, అత్యల్పంగా చోడవరం శాసనసభ స్థానానికి 6 గురు అభ్యర్థులు పోటీపడుతున్నట్లు ముఖేష్ కుమార్ మీనా ప్రకటనలో తెలిపారు.

---------------------------

తెలంగాణలో నిన్న విడుదలైన పదో తరగతి ఫలితాల్లో 91.31 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు నిర్వహించిన ఈ పరీక్షలకు మొత్తం 5 లక్షల 5 వేల 813 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ ఫలితాల్లో బాలికలు 93.23 శాతంతో అత్యధిక ఉత్తీర్ణత సాధించారు. 99.05 శాతంతో నిర్మల్ జిల్లా మొదటి స్థానంలోనూ..65.10 శాతంతో వికారాబాద్ చివరి స్థానంలో నిలిచాయి.

జూన్ 3 నుంచి 14 వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బి. వెంకటేశం తెలిపారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు నేటి నుంచి 15 రోజుల పాటు అవకాశం కల్పిస్తున్నామని.. ఈనెల 16వ తేదీలోపు పాఠశాలల ప్రధానోపాధ్యాయుల వద్ద ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు.

---------------------------

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ రోజు మూడు నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. ఈ ఉదయం విజయనగరం లోక్‌సభ స్థానం పరిధిలోని బొబ్బిలిలో ఉన్న మెయిన్ రోడ్ కూడలిలో జరిగే ప్రచార సభలో జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారు. మధ్యాహ్నం అనకాపల్లి పార్లమెంట్ పరిధిలోని పాయకరావుపేటలో జరిగే సభలో పాల్గొంటారు. అలాగే ఏలూరులో జరిగే ప్రచార సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు.

---------------------------

ఈ రోజు ప్రపంచ కార్మిక దినోత్సవం ..... " మే" డే జరుపుకుంటున్నారు. అమెరికాలోని చికాగో నగరంలో 1886 సంవత్సరంలో జరిగిన కార్మికుల ప్రదర్శన ..... " మే " డే ఆవిర్భావానికి నాంది పలికింది. 1886 మే ఒకటవ తేదీన 8 గంటల పని విధానం కావాలని కోరుతూ......వేలాదిమంది కార్మికులు పోరాటం ప్రారంభించారు. ఈ నినాదానికి మద్దతుగా చికాగోలోనే భారీ ప్రదర్శన జరిగింది. ఇది ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జరిపిన కాల్పుల్లో అనేకమంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ కార్మిక ప్రదర్శనలో మరణించిన వారి స్మృత్యర్థం ప్రతి ఏటా మే ఒకటవ తేదీన కార్మిక దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. కార్మిక దినోత్సవాన్ని భారతదేశంలో అంతరాష్ట్రీయ కార్మిక దివస్ లేదా కాంగర్ దిన్‌గా పిలుస్తారు. మేడే సందర్భంగా పలువురు ప్రముఖులు దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

---------------------------

తెలంగాణలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్-ఫార్మా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీఎస్ ఈఏపీసెట్ పరీక్షల హాల్‌టికెట్లు విడుదలయ్యాయి. విద్యార్థులు తమ రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీ వివరాలను నమోదు చేసి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు.

ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు టీఎస్ ఈఏపీసెట్ పరీక్షలు జరగనుండగా.. 7, 8 తేదీల్లో అగ్రికల్చర్

అండ్ ఫార్మసీ పరీక్షలు, 9, 10, 11 తేదీల్లో ఇంజినీరింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది ఈఏపీ సెట్ కోసం తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 3.54 లక్షల మందికి పైగా విద్యార్థులు నమోదు చేసుకున్నారు.

---------------------------

ఎన్నికల నిర్వహణలో తనిఖీ బృందాలు అక్రమ నగదు పట్ల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని శాసనసభ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు రమాకాంత్ ప్రధాన్ స్పష్టం చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో తనిఖీ, పర్యవేక్షణ బృందాలతో నిన్న వ్యయ నమోదుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రచారంలో భాగంగా నిర్వహించే ర్యాలీలు, సమావేశాలు, ఇతర కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు. ప్రతి వ్యయాన్ని పరిశీలించాలని స్పష్టం చేశారు. వ్యయ రిజిస్టర్ లలో రోజు జరిగే ఖర్చును పొందుపార్చాలన్నారు. వ్యయ రిజిస్టర్లకు అనుబంధంగా ఎన్నికల వ్యయ విభాగం ప్రతి అభ్యర్థి ఖర్చులను పరిశీలించి షాడో రిజిస్టర్లో నమోదు చేస్తుందని తెలిపారు.

---------------------------

సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలోని కాజీపేట రైల్వే జంక్షన్, బోనకల్, మధిర, తదితర రైల్వే స్టేషన్ల మధ్య జరుగుతున్న మూడోలైన్ ఇంజినీరింగ్ పనుల కారణంగా కాజీపేట రైల్వే జంక్షన్ మీదుగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నడిచే పలు రైళ్లను రద్దు చేయగా, మరికొన్ని దారి మళ్లించినట్టు రైల్వే అధికారులు తెలిపారు. విశాఖపట్నం-నుంచి లోకమాన్య తిలక్ టెర్మినల్ రైల్వే స్టేషన్ల మధ్య ప్రతి రోజు రాకపోకలు సాగించే రెండు ఎల్‌టీటీ రైళ్లను, తిరుపతి నుంచి ఆదిలాబాద్ మధ్య ప్రతి రోజు నడిచే రెండు కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల మే 15 నుంచి 21వ తేదీ వరకు సికింద్రాబాద్,పగిడిపల్లి,- గుంటూరు, విజయవాడ రైల్వే స్టేషన్ల మీదుగా దారి మళ్లించినట్టు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఉష్ణోగ్రతలు, వడగాల్పుల తీవ్రత మరింత పెరగనుందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ పేర్కొంది. రానున్న రెండు, మూడు రోజుల్లో 47 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని తెలిపింది.

తెలంగాణాలో ఈరోజు, రేపు ఎండల తీవ్రత కొనసాగుతుందని, వడగాలులు వీస్తాయని హైదరాబాద్‌లోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది. పలు జిల్లాలకు వడగాలుల ముప్పు పొంచి ఉందని, ప్రధానంగా ఉమ్మడి కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లో వడగాలులు వీస్తాయని సూచించింది. ఈ జిల్లాలకు 'పసుపు' రంగు హెచ్చరికలు జారీచేసింది. రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడటంతో ఎండల తీవ్రత కొనసాగే అవకాశాలు ఉన్నాయని సూచించింది.

---------------------------

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ –ఐసీసీ జూన్ 1 నుంచి 29 వరకు నిర్వహించే 9వ టి20 ప్రపంచకప్ కోసం 15 మంది సభ్యులతో భారత జట్టును బిసిసిఐ ప్రకటించింది. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని బోర్డు సెలక్షన్ కమిటీ నిన్న సమావేశమై ఆటగాళ్లను ఎంపిక చేసింది.

======================